ముమ్మరంగా కొనుగోళ్లు



పుల్లయ్యబంజరు కేంద్రంలో కాంటా వేసిన సన్నరకం ధాన్యం

కల్లూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మండలంలో 27 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా పుల్లయ్యబంజరు, లోకవరం, జీడిపిపల్లి, బత్తుపల్లిలో కొనుగోళ్లు చకచకా సాగుతున్నాయి. రైతులు పలువురు కేంద్రాల వద్దే ధాన్యం ఆరబోయగా 17శాతం తేమ రాగానే ఏఈఓలు టోకెన్లు జారీ చేస్తున్నారు. ఆ వెంటనే ధాన్యం కాంటా వేయించి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నారు. సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నారు. మండలంలో సుమారు 4 లక్షల క్వింటాళ్ల మేర ధాన్యం కొనుగోలు చేసే అవకాశముండగా, కల్లూరు రైస్ మిల్లుల్లో ఆ స్థాయిలో ధాన్యం నిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో ఇతర మండలాలకు తరలించనున్నట్లు తెలుస్తోంది.

కల్లాలు లేక కష్టాలు..



రహదారిపైనే ఆరబోసిన ధాన్యం

రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబోసేందుకు కల్లాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే 17శాతానికి మించి తేమ ఉంటే నిరాకరిస్తున్నారు. దీంతో కొందరు కొనుగోలు కేంద్రాల వద్దే ఆరబోస్తుండగా.. మరికొందరు రహదారులనే ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో తగిన స్థలం లేక, పంట పొలాలను యాసంగికి సాగు చేస్తుండడంతో స్థలాభావం ఎదురవుతోంది. దీంతో రహదారులపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. ఈ కారణంగా ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. అంతేకాక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముండడంతో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. గత ప్రభుత్వంలో సబ్సిడీపై కల్లాలు మంజూరు చేసినా పలువురు వినియోగించడం లేదని తెలుస్తోంది.

మిషన్ల జోరు.. కూలీల బేజారు



వరి పంట కోస్తున్న హార్వెస్టర్

మండల వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కల్లూరు మండలంలోని గ్రామాల్లో వందలాది మంది కూలీలు వరి కోతల ద్వారా ఉపాధి పొందేవారు. గత మూడేళ్లుగా ఎక్కువ మంది యంత్రాలను ఆశ్రయిస్తుండడంతో కూలీలకు పని కరువైంది. మండలంలో 33,500 ఎకరాల్లో వరి సాగవుతుంది. కూలీలతోనే వరి కోయించడం, కుప్పలు వేయడం, నూర్పిడి, తూర్పార పట్టే పనులు చేయించేవారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన యంత్రాల ద్వారా ఇవన్నీ జరిగిపోతున్నాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి పలువురు వరికోత యంత్రాలతో రాగా రైతులు ఆశ్రయిస్తున్నారు. వీటి ద్వారా సమయం కలిసొస్తుండడంతో ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఎకరా పొలంలో వరి కోసినందుకు రూ.3,500 మేర వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

● ఆరో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ సూచించారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చట్టాలను తెలుసుకోవడమే కాక తమ ప్రాంతంలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కోర్టుల పని విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్రావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పేద క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాస్టర్లు

ఎర్రుపాలెం: రానున్న క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏటా మాదిరిగానే ప్రభుత్వం పేద క్రైస్తవులకు నూతన వస్త్రాలు పంపిణీ చేయాలని పాస్టర్ల ఫెలోషిప్ మండల అధ్యక్షుడు కోట ఆదాం ఎలీషా కోరారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ ఎం.ఉషాశారదకు శనివారం వినతిపత్రం అందచేసి మాట్లాడారు. నిరుపేద క్రైస్తవ పాస్టర్లకు సబ్సిడీపై రుణాలను మంజూరు చేయాలని, శిథిలావస్థలో ఉన్న చర్చిల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో పులి వినోద్, దేవరకొండ జైపాల్, పగిడిపల్లి స్వామి, కొమ్ము జీవానందం, కే.ఎస్.రత్నం, కృష్ణ, తెరాటి ఏసురత్నం పాల్గొన్నారు.

గ్రూప్- 3 పరీక్ష ఏర్పాట్లు పరిశీలన



పల్లిపాడు పరీక్ష కేంద్రంలో సూచనలు చేస్తున్న ఆర్‌డీఓ

కొణిజర్ల: గ్రూప్ –3 పరీక్షలు ఆది, సోమవారం జరగకుండా కొణిజర్ల మండలంలోని పరీక్షా కేంద్రాలను ఖమ్మం ఆర్‌డీఓ నరసింహారావు శనివారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించాకే అనుమతించాలని తెలిపారు. తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరకాల ధాన్యానికి బోనస్ చెల్లించాలి

పెనుబల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని సీపీఎం నాయకుడు చలమల విఠల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ సన్నరకాలకే ప్రభుత్వం బోనస్ ఇస్తుండడం సరికాదన్నారు. అలాగే, రుణమాఫీ, రైతు భరోసా హామీలు కూడా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈనెల 26 న జరిగే సీపీఎం డివిజన్ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గాయం తిరుపతిరావు, నల్లమల అరుణ్, ప్రదీప్, నర్సింహారావు, సత్యం, బాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



చింతకాని : మత్కేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న చైర్మన్ రాయల

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో లోపాలు ఎదురుకాకుండా ఉద్యోగులు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. చింతకాని మండలం మత్కేపల్లి లో సర్వేను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పూర్తి వివరాలను తప్పులు లేకుండా లేకుండా నమోదు చేసేలా ప్రజలకు కూడా సహకరించాలని తెలిపారు. తద్వారా సంక్షేమ పథకాల అమలు సులువవుతుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, కంచం కోటేశ్వరరావు, బొలకొండ రామారావు, తిరుపతి రామకోటేశ్వరరావు, నర్శింశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుటుంబానికి పరామర్శ

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురానికి చెందిన రావూరి జమలయ్య ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి శనివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు పోట్ల నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, కనపర్తి మోహన్‌రావు, జెట్టి వినోద్, చేకూరి రామయ్య పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇప్పించిన ఘనత మాదే..



మాట్లాడుతున్న రమేష్

కొణిజర్ల: పోడు సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులకు పట్టాలు ఇప్పించిన ఘనత సీపీఐకే దక్కుతుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ తెలిపారు. మండలంలోని తుమ్మలపల్లి, అన్నవరం లో శనివారం నిర్వహించిన సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీపీఐ అగ్రనేతలు నల్లమల గిరిప్రసాద్, చంద్ర రాజేశ్వరరావు, ఎమ్మెల్యే రజబ్ అలీ కృషితో మండలంలోని పలు గ్రామాల నిరుపేదలకు పోడు హక్కు పత్రాలు లభించాయన్నారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు చేసిన మేలేమీ లేదని విమర్శించారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి ధాన్యం, పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కట్ల సత్యం, గడల శ్రీనివాసరావు, సూర్యం, బాలాజీ, సూర్యా, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు

'చిన్నారి' కార్యక్రమంపై అవగాహన



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

మధిరరూరల్: మండలంలోని నాగవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న చిన్నారి కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, మంచి, చెడు స్పర్శ, మాదకద్రవ్యాల వాడకంతో అనర్థాలు, ఇంటర్‌నెట్ దుర్వినియోగం, అక్రమ రవాణాపై తదితర అంశాలపై వ విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాక శరీరంలో వచ్చే మార్పులు, లైంగిక వేధింపులపై వివరించారు. హెచ్‌ఎం పురం సంగారావు, ఉపాధ్యాయులు సీహెచ్‌వీ.రవి కుమార్, హరిప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, టీచర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

బీమాతో కుటుంబాలకు ధీమా



బీమా చెక్కు అందచేస్తున్న బ్యాంక్ మేనేజర్ శోభ

సత్తుపల్లిరూరల్: బీమా పథకాల్లో అందరూ చేరాలని, తద్వారా అనుకోని పరిస్థితులు ఎదురైతే కుటుంబాలకు నగదు అందుతుందని గ్రామీణ వికాస్‌బ్యాంక్ మేనేజర్ శోభ తెలిపారు. సత్తుపల్లి మండలం గంగారం బ్రాంచ్ ఆధ్వర్యాన బీమా చేయించుకున్న రామానగరానికి చెందిన దార్ల భాస్కర్‌రావు ఇటీవల మృతి చెందారు. అప్పటికే ఆయన జీవనజ్యోతి పథకంలో చేరి ఉండగా మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును భాస్కర్‌రావు సతీమణి బేబీకి మేనేజర్ శనివారం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, జగదీష్, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చిత్రాలు

తల్లాడ: తల్లాడలోని బాలభారతి విద్యాయంలో శనివారం ఆర్ఆర్ మెమోరియల్ ఆధ్వర్యాన నిర్వహించిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈసందర్భంగా పలువురు గీసిన రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సంఘ సంస్కర్తలు, స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలను ప్రదర్శించారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో చరిత్రపై అవగాహన పెరుగుతుందన్నారు. బాలభారతి విద్యాలయం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ఇన్‌చార్జి యాచమనేని శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో బీసీ కమిషన్ సమావేశం

సత్తుపల్లి: ఖమ్మం కలెక్టరేట్ ఆదివారం బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు నేతృత్వాన సమావేశం జరుగుతుందని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై బీసీ వర్గాల ప్రజలు, సంఘాల నాయకులు తమ సూచనలు, అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా సమర్పించొచ్చని వెల్లడించారు.

టీబీ యూనిట్ సందర్శించిన డీఎంహెచ్‌ఓ

మధిర: మధిర సివిల్ ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌ను శనివారం డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి సందర్శించారు. ఈసందర్భంగా యూనిట్ ద్వారా బాధితులకు పరీక్షలు, మందుల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. 2025 నాటికి టీబీ వ్యాధిని పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని కోరారు. సివిల్ ఆస్పత్రిసూపరింటెండెంట్ కె.అనిల్‌కుమార్‌తో పాటు పృథ్వీ నాయక్, సందీప్, లంకా కొండయ్య, సుదర్శన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

ముదిగొండ: మండలంలోని డి.సైదులుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మందరపు నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫారసుతో రూ.55వేల సాయం మంజూరైందని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మందరపు ఉపేందర్‌రావు, నాయకులు కొమ్ము నర్సింహారావు, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి బియ్యం వితరణ



బియ్యం అందచేస్తున్న సంఘం సభ్యులు

బోనకల్: మండలంలోని లక్ష్మీపురానికి చెందిన తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షుడు రుద్రాక్షల మల్లయ్యాచారి ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి సంఘం బాధ్యులు శనివారం 50 కేజీల బియ్యం అందజేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణచారితో పాటు పంతంగి శ్రీనివాసాచారి, రావుట్ల వెంకటాచారి, తాటికొండ విసిగ్నాచారి, రావుట్ల లక్ష్మీనారాయణచారి, చిట్టోజు సతీష్‌చారి, బంగారు అప్పలాచారి, మోడేపల్లి వీరబ్రహ్మచారి, ద్రోణాజుల నాగ బ్రహ్మచారి, రుద్రాక్షల నర్సింహచారి, బస్వాచారి, పాల్గొన్నారు.

గ్రూప్-4 విజేతలకు సన్మానం



కొణిజర్ల : మురళిని సత్కరిస్తున్న నాయకులు



తల్లాడ : అర్షద్‌ను సన్మానిస్తున్న ముస్లిం కమిటీ సభ్యులు

కొణిజర్ల/తల్లాడ: గ్రూప్–4 ఫలితాల్లో అర్హత సాధించిన కోర్టులో ఉద్యోగం సాధించిన కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన వేముల మురళిని సీపీఐ నాయకులు శనివారం సన్మానించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, మాజీ సర్పంచ్ కట్ల సత్యంతో పాటు బోయినపల్లి రాజా, జోగు దుర్గయ్య, కామ యోహాన్, రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, సివిల్ సప్లయీస్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన తల్లాడ మండలం మల్లారానికి చెందిన షేక్ అర్షద్‌ను ముస్లిం కమిటీ ఆధ్వర్యాన సన్మానించారు. కమిటీ సభ్యులు షేక్ దస్తగిరి, షేక్ మహబూబ్‌అలీ, షేక్ జానీనియా, నాగుల్‌మీరా, హుస్సేన్, గఫూర్, సత్తార్ మియా, అజ్గర్ పాల్గొన్నారు.

మైక్రో మిషన్ విధానాన్ని ఎత్తివేయాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

వైరా: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నబియ్యం నిర్ధారణకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన మైక్రో మిషన్ పద్ధతిని ఎత్తివేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మార్కెట్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బియ్యం గింజ పొడవు, వెడల్పును కొలిచి సన్న బియ్యంగా నిర్ధారించేందుకు సమకూర్చిన యంత్రాలతో రైతులకు అన్యాయం జరుగుతుందని, భవిష్యత్‌లో ఇది వారికి శాపంగా మారుతుందన్నారు. ఈమేరకు రైతులు పండించే 32 రకాల ధాన్యాన్ని సన్నరకాలుగా గుర్తించడంతో పాటు అన్ని రకాల ధాన్యానికి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు, తోట నాగేశ్వరరావు, వడ్లమూడి మధు, అమరనేని కృష్ణ, రైతులు మేదరమెట్ల పూర్ణయ్య, శ్రీనివాసరావు, నాగరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ధ్వజారోహణం



పూజలో పాల్గొన్న మాలధారులు

సత్తుపల్లిటౌన్: స్థానిక జేవీఆర్ పార్కు ఎదురుగా ఉన్న శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం ధ్వజారోహణ పూజ నిర్వహించారు. తొలుత అయ్యగారిపేట బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించగా, అయ్యప్ప మాలధారులు నగర సంకీర్తనగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యాన ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, నాగళ్ల ప్రసాద్, పోలిశెట్టి శివకుమార్, వెంకటసురేష్ ఆచార్యులు, దురిశేటి శ్రీనివాస్, బొంతు శ్రీనివాసరావు, మామిళ్లపల్లి హరిబాబు, దోసపాటి అమరలింగేశ్వరరావు, మట్టా శివ, పర్వతనేని వేణు, చెన్నకేశవరెడ్డి, నాగళ్ల ప్రసాద్, మాధవాచారి పాల్గొన్నారు.

స్టోర్ రూమ్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి(శివాలయం) ఆలయ ప్రాంగణంలో రూ.3లక్షల వ్యయంతో నిర్మించనున్న స్టోర్ రూమ్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. దాత, ఎన్ఆర్ఐ కర్నాటి శంకర్‌రెడ్డి, అర్చకులు కాశావజ్జల నర్సింహామూర్తి శంకుస్థాపన చేయగా శంకర్‌రెడ్డి మాట్లాడారు. తన తండ్రి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కర్నాటి రామిరెడ్డి జ్ఞాపకార్థం స్టోర్ రూమ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను స్థానికులు సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్, ప్రధాన కార్యదర్శులు యన్నం పిచ్చిరెడ్డి, పెద్దమళ్ల మోహన్‌రావు, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డితో పాటు జంగా పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



అంబటి వీరయ్య (ఫైల్)

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అంబటి వీరయ్య(97) శనివారం మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కన్నుమూశారు. ఈమేరకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పోట్ల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, కూరపాటి కిషోర్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడు..



వెంకటనరసయ్య (ఫైల్)

కల్లూరురూరల్: కల్లూరు మండలం లింగాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు హనుమంతు వెంకటనరసయ్య(59) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. తొలుత సీపీఎంలో కొనసాగిన ఆయన తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వెంకటనరసయ్య మృతిపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు పాలెపు రామారావు, పసుమర్తి చంద్రరావు, మట్టూరి జనార్దన్, బొగ్గుల వెంకట్రామిరెడ్డి సంతాపం తెలిపారు.

ఈఓను సన్మానించిన నాయకులు



ఈఓను సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు: ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరిస్తున్న కల్లూరు గ్రామపంచాయితీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావును శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. స్థానికంగా మధిర రోడ్డులో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించడమే కాక ఇతర సమస్యలపై దృష్టి సారించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు నాయకులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, జొన్నలగడ్డ గోపాలస్వామి, మాదిరాజు లక్ష్మణరావు, ఎస్కే. అఫ్రోజ్, మేకల ప్రసాద్, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, గద్దల వెంకటేశ్వర్లు, షేక్ యాకూబ్‌మియా తదితరులు ఈఓను సన్మానించారు.